క్లుప్తంగా

అభివృద్ధే సీఎం జగన్ లక్ష్యం



మాట్లాడుతున్న వెంకటరమణ

జి.సిగడాం: పల్లెల అభివృద్ధే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ మంజూరు చేసిన నిధులతో శరవేగంగా పనులు చేపట్టాలన్నారు. ఎమ్మెల్యే కృషితో 21 గ్రామ సచివాలయాల్లో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఇప్పటికే సచివాలయాలు పనులు పూర్తిచేసి 80 శాతం వరకు భవనాలను ప్రారంభించామన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలంతా సీఎం జగన్‌కు అండగా నిలవాలని కోరారు.

రిమ్స్ అన్నపూర్ణ సేవకు విరాళం



పూజలు చేస్తున్న సత్యసాయి భక్తులు

శ్రీకాకుళం కల్చరల్: హయాతినగరానికి చెందిన మాజీ మున్సిపల్ చైర్మన్ కిల్లాన భోజ్ కుమార్ రిమ్స్‌లో సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో అన్నపూర్ణ నిత్యాన్నదాన పథకానికి రూ.10వేలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో సూర రామచంద్రరావు, కిల్లాన మాధవరావు, రాము, కృష్ణ, మురళి పాల్గొన్నారు.

పశువులకు లంపీస్కిన్ టీకాలు



లంపీ స్కిన్ టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

లావేరు: పాడి రైతుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు గొర్లె సూర్యప్రకాష్ అన్నారు. మండలంలోని పెదరొంపివలసలో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో బుడుమూరు పశువైద్య కేంద్రం పశువైద్యుడు హేమంత్‌కుమార్, వెటర్నరీ అసిస్టెంట్‌లు రాజేశ్వరీ, శ్రీనివాసరావు పశువులుకు ఉచితంగా లంపీస్కిన్ వ్యాధి నిరోధక టీకాలు గురువారం వేశారు. పశువైద్యుడు హేమంత్‌కుమార్ పాల్గొన్నారు.

నర్సింగ్ కళాశాల పనుల పరిశీలన



గదులు పరిశీలిస్తున్న మెడికల్ కళాశాల సిబ్బంది

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని సింగుపురంలో చేపట్టిన నర్సింగ్ కళాశాల నిర్మాణ పనులను రిమ్స్ మెడికల్ కళాశాల సిబ్బంది గురువారం పరిశీలించారు. గదులు, కిచెన్, వసతి గృహాల సౌకర్యాలపై ఆరాతీశారు. ప్రస్తుతం రిమ్స్ కళాశాలలో పూర్తిస్థాయి సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో మరో రెండు నెలల్లోగా సింగుపురం భవనాన్ని అందుబాటులోకి తీసుకొస్తామని సిబ్బంది తెలిపారు.

రాజరాజేశ్వరికి అభిషేకాలు



రాజరాజేశ్వరిదేవి

శ్రీకాకుళం కల్చరల్: శ్రావణ మాసం ప్రారంభం సందర్భంగా గురువారం పట్టణంలోని గుడివీధిలో ఉమారుద్ర కోటేశ్వరస్వామి ఆలయంలో రాజరాజేశ్వరీ అమ్మవారికి పాలు, పసుపు, కుంకుమ నీటితో అభిషేకాలు చేశారు. అర్చకులు ఆరవెల్లి శ్రీరామ మూర్తి, చంద్రశేఖరశర్మల ఆధ్వర్యంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు సామూహికంగా లలితా సహస్రనామ పారాయణ నిర్వహించారు. శ్రావణమాసాన్ని ఆహ్వానిస్తూ ప్రత్యేక పూజలు చేశారు. పాలకొండ రోడ్డులోని కోదండ రామాలయంలో అర్చకుడు బంకుపల్లి శేషాచార్యులు ఆధ్వర్యంలో మహాలక్ష్మీ అమ్మవారికి పాలతో భక్తులు అభిషేకాలు నిర్వహించారు.

ప్రభుత్వ విద్యార్థులకు ప్రాధాన్యమివ్వాలి

టెక్కలి: ప్రభుత్వ విద్యా సంస్థల విద్యార్థులకు మొదటి ప్రాధాన్యతగా వసతి గృహం సీట్లు ఇవ్వాలని ఏపీ నిరుద్యోగ పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు టి.సూర్యం డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయం పరిపాలనాధికారి బి.రాజమోహన్‌కు వినతిపత్రం అందజేశారు. టెక్కలి బీసీ బాలికల కళాశాల వసతి గృహంలో అర్హత కలిగిన వారికి కాకుండా ఇతరులకు సీట్లు మంజూరు చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఒక వైపు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ విద్యా విధానంలో పెను మార్పులు తీసుకువస్తుంటే ఇక్కడ మాత్రం కొందరు వసతి గృహం అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.

19న బహు భాషా నృత్య సంబరం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు, నిర్వాహకులు

శ్రీకాకుళం కల్చరల్: విశాఖపట్నం స్కూల్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఈ నెల 19న బాపూజీ కళామందిర్‌లో జరగనున్న బహుభాషా నృత్య సంబరం పోస్టర్‌ను మంత్రి ధర్మాన ప్రసాదరావు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్రా అత్యంత ప్రతిభావంతులైన కళాకారులకు చిరునామాగా అంతర్జాతీయ స్థాయి గుర్తింపు పొందిందన్నారు. శ్రీకాకుళం ప్రేక్షకులకు విభిన్న నృత్య రీతులను తిలకించే అవకాశాన్ని కల్పించిన నిర్వాహకులను అభినందించారు.

నృత్య సంబరం చైర్మన్ అంధవరపు కోటేశ్వరరావు మాట్లాడుతూ భారత్‌లోని వివిధ ప్రాంతాలకు చెందిన జానపద, శాస్త్రీయ నృత్యాలతో పాటు నేపాల్, ఇండోనేషియా వంటి దేశాలకు చెందిన సంప్రదాయాల ను కూడా ప్రదర్శిస్తారని తెలిపారు. రాష్ట్ర కళింగ వైశ్య సంఘం అధ్యక్షుడు పట్నాల శ్రీనివాస్(కోణార్క్‌శ్రీను), డ్యాన్స్ ఫెస్టివల్ వైస్ చైర్మన్, రాష్ట్ర కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు మాట్లాడుతూ సుమారు మూడు గంటల పాటు ప్రత్యేక నృత్యాల ప్రదర్శన ఉంటుందని చెప్పారు. స్కూల్ ఆఫ్ థియేటర్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు, అంతర్జాతీయ స్థాయి గుర్తింపు పొందిన జానపద నృత్య దర్శకులు ఆర్.నాగరాజు పట్నాయక్ మాట్లాడుతూ శనివారం సాయంత్రం 5 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పూన్న నాగరాజు, గంట చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న లేఅవుట్ పరిశీలన



లేఅవుట్‌ను పరిశీలిస్తున్న స్పెషల్ సెక్రటరీ మహమ్మద్ దివాన్ మైదీన్

శ్రీకాకుళం రూరల్: రాగోలులోని జగనన్న లే అవుట్‌లో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను గృహనిర్మాణ సంస్థ స్పెషల్ సెక్రటరీ మహమ్మద్ దివాన్ మైదీన్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవరత్నాల్లో భాగంగా పేదలందరికీ ఇల్లు కార్యక్రమం శతశాతం పూర్తవ్వాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిచే ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా చేపట్టాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్, గృహనిర్మాణ సిబ్బంది పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సాయం



రిక్షా బాగు చేసి కార్మికునికి అందించిన దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: ఆర్థిక పరిస్థితి సహకరించని నిరుపేదలను ఆదుకోవడం మానవ ధర్మమని లయన్స్ క్లబ్ శ్రీకాకుళం అధ్యక్షుడు పొన్నాడ రవికుమార్ అన్నారు. శ్రీకాకుళం కిన్నెర థియేటర్ సమీపంలో ఓ రిక్షా కార్మికుడికి క్లబ్ తరఫున రిక్షా బాగు చేసి గురువారం అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ మెంటార్ నటుకుల మోహన్, జోన్ చైర్మన్ బాడాన దేవభూషణరావు, సెక్రటరీ కె.రాంగోపాల్, కోశాధికారి శిల్లా మణి తదితరులు పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి



వినతిపత్రం అందజేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు

లావేరు: సమాన పనికి సమాన వేతనం వచ్చేలా కృషి చేయాలని కోరుతూ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్లుకు మండలంలోని సీఆర్‌ఎంటీలు, ఎమ్మార్సీ కార్యాలయం కాంట్రాక్టు ఉద్యోగులు గురువారం వినతిపత్రం అందజేశారు. లావేరులోని ఎంఆర్‌సీ కార్యాలయానికి వచ్చిన వెంకటేశ్వర్లును కలిశారు. ప్రతినెలా 1వ తేదీన జీతాలు వచ్చేలా చేయాలని, రెగ్యులర్ ఉద్యోగులకు కల్పించేలా అన్ని సదుపాయాలు కల్పించాలని, పీఆర్‌సీ ప్రకారం 23 శాతం జీతాలు పెరిగేలా కృషి చేయాలని కోరారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.అప్పారావు, ప్రధాన కార్యదర్శి ఎస్.కిశోర్‌కుమార్, జిల్లా నాయకుడు యండ ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న ఎంపీపీ పిన్నింటి రజిని

రణస్థలం: అందరి సహకారంతోనే అభివృద్ధి సాధ్యమని ఎంపీపీ పిన్నింటి రజిని అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సాధారణ సర్వసభ్య సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు శాఖల అధికారులు.. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను వివరించారు. పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ మండలంలోని కోష్ట అసిస్టెంట్ లైన్‌మన్.. వ్యవసాయ మోటార్లకు విద్యుత్ కనెక్షన్ ఇస్తానని చెప్పి పలువురు రైతుల వద్ద రూ.6.28 లక్షలు వసూల్ చేశారని పతివాడపాలెం సభ దృష్టికి తీసుకువచ్చారు. దేరసాం, నెలివాడతోపాటు చుట్టుపక్కల గ్రామాల రైతుల నుంచి భారీగా డబ్బులు వసూలు చేసినట్లు వెల్లడించారు. దీనిపై స్పందించిన పైడిభీమవరం ఏఈ శ్రీనివాస సాహు మాట్లాడుతూ.. జూన్ 7వ తేదీ నుంచి కోష్ట అసిస్టెంట్ లైన్‌మన్ విధులకు హాజరుకావడం లేదని, జీతం కూడా నిలిపివేశామని, విధులకు రాకపోవడం పట్ల ఉన్నతాధికారులు తెలియజేశామని చెప్పారు. దీనిపై రైతులు లిఖిత పూర్వక ఫిర్యాదు ఇస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామన్నారు. ఇటీవల వేటకు వెళ్లి మృతిచెందిన ముగ్గురు మత్స్యకారుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున నష్టపరిహారం అందజేసినట్లు సంబంధిత అధికారి తెలియజేశారు. సమావేశానికి తహసీల్దార్ హాజరుకాకపోవడం పట్ల కృష్ణాపురం ఎంపీటీసీ మహంతి చినరామినాయుడు అభ్యంతరం వ్యక్తం చేశారు. భూ సమస్యలపై సమావేశంలో ప్రస్తావిద్దామంటే తహసీల్దార్ రావటం లేదన్నారు. తోటపల్లి కాలువ ద్వారా సాగునీరు రాలేదని పలువురు ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్యలపై ఎంపీపీ మాట్లాడుతూ రణస్థలం గ్రామంలో తోటపల్లి పరిహారం ఒక రైతుకు బదులు మరొక రైతుకు పడిందని, దీంతో అక్కడక్కడ భూ సేకరణ పూర్తికాలేదన్నారు. దీంతో కాలువ తవ్వకం పనులు నిలిచిపోయాయని, త్వరలోనే ఈ సమస్య పరిష్కరిస్తామన్నారు. తోటపల్లి అధికారులు, తహసీల్దార్ గైర్హాజరుపై శాఖాపరమైన నివేదిక తీసుకుంటామన్నారు. ఎంపీడీఓ రమణమూర్తి, మండల ప్రత్యేకాహ్వానితులు పిన్నింటి సాయికుమార్, జెడ్పీటీసీ టొంపల సీతారాం, వైస్ ఎంపీపీ రాయపురెడ్డి భుజంగరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

ఆదర్శ పాలకుడు సీఎం జగన్



పథకాల లబ్ధిని వివరిస్తున్న ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పాలన సాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు అన్నారు. ఎన్నికల హామీలు నిలబెట్టుకుని దేశమంతా ఏపీ వైపే చూసేలా పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. శ్రీకాకుళం నగరంలోని మహాలక్ష్మినగర్ కాలనీలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి నాలుగేన్నరేళ్లుగా అందుతున్న ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంక్షేమ పాలన ఓర్వలేకే ప్రతిపక్షాలు విష ప్రచారం చేస్తున్నాయని, వాటిని నమ్మే స్థితిలో ప్రజలు లేరని చెప్పారు. అబద్ధాలు చెప్పేవారికి వత్తాసు పలుకుతారో.. ఇచ్చిన మాట నిలబెట్టుకున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ఓటు వేస్తారో మీరే నిర్ణయించుకోవాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వరద బాధిత కుటుంబాలకు సాయం



బాధితుల కోసం ఫుడ్ ప్యాకెట్లు

శ్రీకాకుళం కల్చరల్: హిమాచల్‌ప్రదేశ్ వరదల వల్ల నిరాశ్రయులైన కుటుంబాలకు నగరానికి చెందిన వాణిజ్యవేత్త రాజేంద్ర కర్నాని కుటుంబం బాసటగా నిలిచింది. జాతీయ స్థాయి స్వచ్ఛంద సంస్థ కార్య కర్తల సహకారంతో హిమాచల్‌ప్రదేశ్‌లో వరద ప్రభావిత ప్రాంతాల్లో గురువారం అన్నం పొట్లాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దినేష్ కర్నాని, కమల్ కర్నాని పాల్గొన్నారు.

ఐటీ కేసులపై దృష్టి పెట్టాలి



సీసీ కమాండ్ కంట్రోల్ రూం పనితీరును పరిశీలిస్తున్న ఎస్పీ జీఆర్ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : ఐటీ కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టి దర్యాప్తు చేయాలని ఎస్పీ జీఆర్ రాధిక రెండో పట్టణ ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనివాసరావుకు సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం నగరంలోని రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ క్రమంలో ముందుగా పోలీస్ స్టేషన్ పైభాగంలో ఉన్న కమాండ్ కంట్రోల్ రూమ్ సందర్శించి సీసీ కెమెరాలు ఎలా పనిచేస్తున్నాయన్న దానిపై, స్టేషన్‌లో ఉన్న ఈ మాల్ ఖానాలో ఉన్న ప్రాపర్టీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. దర్యాప్తులో ఉన్న ముఖ్యమైన కేసుల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి గ్రేవ్, ఐటీ తదితర కేసుల దర్యాప్తు త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. సైబర్ ఫిర్యాదులపై తక్షణమే స్పందించి బ్యాంకు అధికారులతో చర్చించి బాధితులకు న్యాయం జరిగేటట్లు చూడాలని, రాత్రి వేళల్లో బీట్ల సంఖ్య పెంచి తరచూ నేరాలు జరిగే చోట పాత నేరస్తులపై ప్రత్యే నిఘా పెట్టాలన్నారు. అవసరమైన చోట సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి నేరాలను కట్టడి చేయాలని, ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలన్నారు. ముఖ్యమైన కేసుల రికార్డులు, పోలీస్ స్టేషన్ రికార్డుల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. తనిఖీల్లో డీఎస్పీ వై.శృతి, సీసీ శివకుమార్, ఎస్ఐ కె.లక్ష్మి ఉన్నారు.

సంతవురిటిలో పశువైద్య శిబిరం



జి.సిగడాం: ఆవుకు వ్యాక్సిన్ వేస్తున్న వైద్య సిబ్బంది



ఎచ్చెర్ల క్యాంపస్: పశువులకు టీకాలు వేస్తున్న సిబ్బంది

జి.సిగడాం: మండలంలోని సంతవురిటిలో ఉచిత పశువైద్య శిబిరాన్ని సర్పంచ్ బుడారి లక్ష్మణరావు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. 296 పశువులకు స్థానిక పశువైద్య కేంద్రం సిబ్బంది టీకాలు వేశారు. పశువైద్య అధికారి మాధవికల్పన రైతులకు ఉచితంగా మందులను అందజేశారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బొంతలకోడూరులో..

ఎచ్చెర్ల క్యాంపస్: బొంతలకోడూరులో పశు సంవర్థక శాఖ, రిలయన్స్ ఫౌండేషన్ సంయుక్తంగా గురువారం పశువైద్య శిబిరం నిర్వహించారు. ఎచ్చెర్ల వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ సాయిప్రసాద్ వైద్య సేవలు అందజేశారు. పాడి ఆవులకు చూడు, గర్భకోశ, పొదుగు వాపు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. దూడలకు నట్టల నివారణ ద్రావణం తాగించారు. రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధులు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

లావేరు: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి దేశెట్టి తిరుపతిరావు, లావేరు పీహెచ్‌సీ వైద్యురాలు మౌనిక అన్నారు. మండలంలోని తాళ్లవలసలో గురువారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యురాలు, వైద్య సిబ్బంది శిబిరానికి వచ్చిన వారికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్ర పోటీలకు పయనం



జిల్లా హ్యాండ్‌బాల్ జట్టు క్రీడాకారులతో సంఘ ప్రతినిధులు, కోచ్ మేనేజర్లు

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్ర హ్యాండ్‌బాల్ పోటీల్లో తుది వరకు పోరాడాలని హ్యాండ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా అధ్యక్షుడు సుంకరి కృష్ణకుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్మెస్సీ శేఖర్ పిలుపునిచ్చారు. ప్రకాశం జిల్లా ఒంగోలు వేదికగా ఈనెల 18 నుంచి 20వ తేదీ వరకు ఏపీ సీనియర్స్ పురుషుల హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్–2023 పోటీలు జరగనున్నాయి. ఈ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టు గురువారం ఇక్కడ పయనమై వెళ్లింది. ఈ సందర్భంగా జరిగిన వీడ్కోలు కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు పలు సూచనలు చేశారు. ట్రోఫీతో జిల్లాకు తిరిగిరావాలని ఆకాంక్షించారు. సంఘ ప్రతినిధులు రవిశేఖర్, సతీష్‌రాయుడు, హరీష్‌రాయుడు, ఈశ్వరరావు, క్రీడాకారులు పాల్గొన్నారు.

జిల్లా జట్టుకు ఎంపికైనవారి వివరాలు

ఇ.జగదీష్, డి.గోవింద్, జి.పవన్‌కళ్యాణ్, డి.గణేష్ (గోల్‌కీపర్), ఆర్.జగదీష్, సీహెచ్ రాజ్‌కుమార్ (గోల్‌కీపర్), వి.కిరణ్‌కుమార్, కె.లోకేష్, వి.భవిష్యత్‌రాజ్, కె.భార్గవప్రసాద్, ఎ.గోపాల్, కె.సాయికిరణ్, సీహెచ్ మణికంఠ, జి.నర్సునాయుడు, జి.వంశీ, జి.దివాకర్. స్టాండ్‌బైగా జి.యశోధకృష్ణ, కె.రాజేష్, జి.సుమంత్ ఎంపికైనవారిలో ఉన్నారు.

ఇంటి వద్దకే వైద్యం



పెంట గ్రామంలో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

జి.సిగడాం: ఫ్యామిలీ డాక్టర్ విధానంతో ఇంటి వద్దకే వైద్యులు వస్తున్నారు. గురువారం జి.సిగడాం మండలంలోని కొత్తపెంట సచివాలయం పరిధిలో నాగులవలస, పెంట గ్రామాల్లో వైద్యాధికారి యశ్వంత్ వైద్య సేవలు అందించారు. సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు.

జగదీష్‌కు సత్కారం



జగదీష్‌ను సన్మానిస్తున్న పశుసంవర్థకశాఖ ఏడీ, వైద్యులు

లావేరు: మండలంలోని లావేరు గ్రామంలో గల పశువైద్య కేంద్రంలో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్న మామిడి జగదీష్ ఉత్తమ సేవలు అందించినందుకు ఈ నెల 15వ తేదీన రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. జగదీష్‌ను పశుసంవర్థకశాఖ ఏడీ దుర్గారావు, లావేరు, బెజ్జిపురం, బుడుమూరు పశువైద్య కేంద్రాల పశువైద్యులు బి.గాయత్రి, జి.లావణ్య, హేమంత్ తదితరులు గురువారం సన్మానించారు. జగదీష్ పాడిరైతులుకు ఉత్తమ సేవలు అందించడం వల్లే ఈ అవార్డు వచ్చిందని ఏడీ, పశువైద్యులు అన్నారు.

'ప్రజాస్వామ్యానికి మీడియా ప్రాణవాయువు'



మానుకొండ చలపతిరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న జర్నలిస్ట్ సంఘ నాయకుడు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): మీడియా గొంతు బలహీనమైతే ప్రజాస్వామ్యానికి ప్రమాదం తప్పదని గురువారం ఉదయం స్థానిక అంబేడ్కర్ విజ్ఞాన మందిరంలో జరిగిన సేవ్ జర్నలిజం సదస్సులో వక్తలు పేర్కొన్నారు. ఏపీయూడబ్ల్యూజే, సామ్నా జిల్లా శాఖలు సంయుక్తంగా ఈ సదస్సును నిర్వహించారు. అంతకుముందు గరిమెళ్ల ప్రెస్ క్లబ్ ఎదుట ఏపీయూడబ్ల్యూజే పతాకాన్ని ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యులు నల్లి ధర్మారావు ఆవిష్కరించారు. అనంతరం అక్కడ నుంచి నాగావళి తీరంలో ఉన్న యూనియన్ వ్యవస్థాపకులు మానుకొండ చలపతిరావు విగ్రహానికి చేరుకొని పూలమాలతో నివాళులర్పించారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు చింతాడ అప్పలనాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో భాగంగా, సేఫ్ జర్నలిజం సదస్సు జరిగింది. ప్రముఖ రచయిత అట్టాడ అప్పలనాయుడు మాట్లాడుతూ, మీడియా లేనిదే ప్రజాస్వామ్యం మనుగడ లేదన్నారు. జర్నలిస్టుల జీవితాలకు, వృత్తికి భద్రత లేదని, ఇదే ఇతివృత్తంతో ప్రముఖ జర్నలిస్టు, రచయిత దివంగత పతంజలి తన పెంపుడు జంతువులు నవలలో వ్యంగ్యంగా చిత్రీకరించారని గుర్తు చేశారు. దళిత సంఘాల సమన్వయ సమాఖ్య నాయకులు కల్లేపల్లి రామ్‌గోపాల్ మాట్లాడుతూ, మీడియా అండదండలు లేకపోతే ప్రజా ఉద్యమాలకు మనుగడ ఉండదని స్పష్టం చేశారు. న్యాయవాద సంఘ నాయకులు బొడ్డేపల్లి మోహనరావు మాట్లాడుతూ, ఇటీవల గుంటూరులో జరిగిన ఇండియన్ లాయర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభకు ప్రముఖ సామాజిక కార్యకర్త, న్యాయవాది, జర్నలిస్ట్ తీస్తా సెతల్వాద్ హాజరై దేశంలో మీడియాకు ఎదురవుతున్న సవాళ్లను వివరించారని చెప్పారు.